చిగిర్చిన మానవత్వం

జి. భాను



పన్నెండు సంవత్సరాల తర్వాత రాజమండ్రి వెళ్తున్నాను. కిటికీ దగ్గరే కూర్చున్నాను పరిసరాలు చూద్దామని. విజయవాడ — కాకినాడ పాసింజరు గుణదల స్టేషన్ చేరేటప్పటికి వేసవికాలం లోని లేత సూర్యుడు తన కిరణాల్ని పదును పెడుతున్నాడు. ఆ కిరణాలు రైలు బోగీలలోనికి ఏటవాలుగా పడుతున్నాయ్.

జొన్న కంకులు కోసి, ఆ జొన్న

చొప్పను గూళ్ళలాగా వేస్తే అవి మూరానికి గుడిసెల్లా కనబడుతున్నవి. ఆ జొన్న మోళ్ళు, భూదేవికి గగుర్పొడిచిన దేహంపైన వెంట్రుకల్లా అనిపిస్తున్నవి. అక్కడక్కడ ధనియాల కంప, సెనగకంప కళ్లాల వద్ద చిందరవందరగా పడి ఉంది. రైలుబండి తనకేమీ పట్టనట్లుగా కొండచిలువలా సాగిపోతున్నది. వచ్చిన స్టేషన్లను కబళించి ముందుముందుకు సాగుతున్నది.

జనం ఎక్కుతున్నారు; దిగుతున్నారు హడావుడిగా. జనంతోపాటు తాటి తోపులు, తుమ్మ పీకెలు, మామిడి తోటలు, ఇంగ్లీష్ తుమ్మ పొదలు, ఇంకా ఏవో చెట్లు, గుట్టలు, పుట్టలు - బండితోపాటు పరుగెత్తి మాయమైపోతున్నవి. పరిణామ శీలమైన లోకంలో మానవుడికి, మానవుడికీ మధ్య ఉన్న సంబంధం రైలుబండికి, దానితో పరుగెత్తుతున్న ప్రకృతికి ఉన్న సంబంధంలా అనిపించింది నాకు

వయసొచ్చిన సూర్యకిరణాలు చెట్ల ఆకులపైన, చరచరా వస్తువుల పైన పారాడుతుంటే, వాటివాటి తత్త్వాన్నిబట్టి అవి ప్రకాశిస్తున్నవి.

తాటి ముంజలు ముంగాల్లో వేసి అమ్మేవాళ్ళు, వేరుబాదమ్ అంటూ వేరు సెనగపప్పు పాకాన్ని అమ్మేవాళ్లు, కాలక్షేప బఠానీలు అని అరచేవాళ్ళు, చల్లని నిమ్మకాయ్ మజ్జిగ అని గ్లాసులు లోడ లోడ మనిపించేవాళ్ళు ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు అన్ని కంపార్ట్‌మెంట్లలోకి వస్తూ పోతూ ప్రయాణీకుల మనస్సుల్లో సంచలనం కలిగిస్తున్నారు.

రైలుబండి ఏలూరు చేరుకొన్నది. జనం కెరటాల్లా విరుచుకపడి కంపార్టుమెంటుల్లో క్రిక్కిరిసిపోయారు. నేను ఎక్కిన బోగిలో కూడా జనం నిండిపోయారు. ఎండలో ఎక్కిన ప్రయాణీకులు వేసవిని విమర్శిస్తున్నారు. నలుగురితోపాటు నేనూ వేసవి ఉమ్మదనాన్ని భరించలేక, జేబురుమాలుతో విసురుకొంటూ, తుడుచుకొంటూ, నానా కష్టాలు పడుతున్నప్పుడు నా ఎదురు సీట్లో కూర్చొని నన్ను తదేకంగా పరిశీలించే వ్యక్తి నైజం ఆశ్చర్యం కల్గించింది. ఎప్పుడో పరిచయమున్నవాడిలా ఆ క్రొత్తమనిషి నన్ను చూస్తున్నాడు. నేను నా తలను గాలించాను. ఆ మనిషి ఎప్పుడైనా, ఎక్కడైనా తటస్థ పడ్డాడా అని. కానీ ఏనాడూ అటువంటి మనిషిని చూసిన జ్ఞప్తి కల్గనేలేదు.

అతని వయస్సు నలభై ఐదు, ఏభై మధ్య ఉండవచ్చు. మనిషి పొడగరి. అతనిజుట్టు దువ్వెనకులొంగని స్వతంత్ర ప్రవృత్తిని చాటుతున్నది. నుదుటిమీద మూడు గీతలు స్పష్టంగా కనబడుతున్నవి కళ్ళల్లో తేనె పొడలుఉండడం వల్ల పిల్లి కళ్ళులా కనబడుతున్నవి. జీవితంలో ఢక్కామొక్కీలు తిన్న

ఘటంలా అనిపిస్తున్నాడు. వేసుకున్న పంచె, లాల్చీ తెలుపువే గాని, కొంచెం నలిగిపోయి, చాలా దూరం ప్రయాణిం చిన పరిస్థితిని తెలియజేస్తున్నవి. అయితే అతను మాటి మాటికి కాళ్ళు కదిలిస్తు న్నాడు. ప్రతి మనిషిని ఆపాదమస్తకం సాభిప్రాయంగా పరిశీలిస్తున్నాడు. మొత్తం మీద అతని ప్రవృత్తి వింతగా అనిపించి అతణ్ణి పరిశీలనతో వేటాడడం ప్రారంభించాను.

అంతలో బండి కదిలింది బండిలో ఉన్నవాళ్ళం ఊపిరి పీల్చుకున్నాం. బైట ఎండ మిలమిల మెరుస్తున్నది. గాలి తగులుతుంటే చెమటతో తడిసిన శరీరాలు హాయిని అనుభవిస్తున్నవి.

నేను ఒకే విధంగా అంటే ఎక్కువ సేపు కాళ్ళు క్రింద ఉంచి కూర్చోనడం వల్ల సుఖంగా లేక చెప్పుల్లోని కాళ్ళను తీసి సీటుపై ఉంచుకున్నాను. చేతిలో కాళ్ళను ఒత్తుకొంటూ కన్నులు మూసు కొన్నాను.

'ఎక్కడిదాకా మీరు?' అతను ప్రశ్నించాడు.

'నేనా? గోదావరి స్టేషన్లో దిగుతా' అన్నాను.

'సరే! మీ కంటే నేనే కొంచెం దూరం వెళ్ళాలన్నమాట .... సామర్ల కోటలో దిగుతా' అని అన్నాడు నేను ప్రశ్నించకముందే.

ఒకటి రెండు నిముషాల తర్వాత మళ్ళా ప్రశ్నించాడు.

'మీ కుడికాలు మీద నల్లని మచ్చ లాగా వుందే? రంగు ఏదైనా అయిం దేమిటి?' నా కాలిని, చెప్పుల్ని చూస్తూ అడిగాడు.

నా కుడికాలుబొటనవ్రేలుకు తిన్నగా, దాదాపు రెండంగుళాల పైన అర్థ రూపాయి పరిమాణంలో నల్లగా ఉన్న పుట్టుమచ్చపైన అతగాడి దృష్టి పడిం దన్నమాట!

'అబ్బే! ఇది రంగు కాదండీ. పుట్టు మచ్చ!' అన్నాను నేను.

'ఓహో! రూపాయంత ఉందే! అదృష్టమే నండోయ్' అన్నాడు.

'నా మొహం....ఇంతవరకూ అటు వంటిది నా జీవితంలో ఎదురుకాలేదు' అన్నాను.

"అహ(.... అలా తేలిగ్గా కొట్టి పారెయ్యకండి. ఒకదాని ఫలితం వెంటనే .. కలుగు తుందంటారా? దేనికైనా సమయం రావాలండీ....సమయం. మీకో సంగతి చెప్పమంటారా? మా ఊళ్ళో నాకు తెలిసిన సంగతి సుమండీ! మా వూళ్ళో పరమానందం అని ఒక జులాయి వెధవ ఉన్నాడండి....అయితేవాడికి వీపు మీద, ఎడంవైపున బారెడు వెడల్పున నేరేడు పండు రంగులా నిగనిగ లాడు తున్న పుట్టుమచ్చ ఉందండి. పుట్టుమచ్చ పరమానందంగాడు అని మేము ఎగ తాళిగా పిల్చేవాళ్ళం అనుకోండి .... ఓనాడు మావూరి శాస్త్రులుగారు ఆడి పుట్టుమచ్చను విదానంగా చూసి, 'వురే

అనందం! నువ్వు మహానుభావుడివి అవ్వబోతావురా. అర్జునుడికి కూడా ఇల్లాగే పుట్టుమచ్చ వుండేదట! నీ పురాకృత సుకృత విశేషాన నీకూ అల్లాంటి పుట్టుమచ్చే కల్గిందిరా! నీ జాతకం ఎలా మారుతుందో ఎవరు చెప్పగలరు?' అని అన్నాడండి' అని నా ముఖం ప్రక్కన ఉన్నవాళ్ళ ముఖాలు చూశాడు.

'మరి జాతకం మారిందేమిట?' అన్నాను నేను.

'ఓ....అటువంటిదే జరిగింది....మా శాస్త్రులుగారి మాట మజాకా అనుకున్నారేమిటి? వాడికి సెంటు స్థలంగాని, వింకు పొలంగాని లేదు. కాని అయిదెకరాల సుక్షేత్రం సంపాదించాడు అయిదెకరాలు! ఫస్టానయిన ఇల్లు కట్టాడు.... ఇంకేం కావాలి' అన్నారు ఆశ్చర్యంగా అందరి ముఖాలు చూస్తూ.

'ఇంతకీ....ఎలా వచ్చిందంటారు? ఏదైనా స్మగ్లింగ్ వ్యాపారంలో దిగాడేమిటి?' నేను ప్రశ్నించాను.

'అబ్బో! మీరు భలేవారే! అటువంటిదేం లేదండోయ్.... వాడు ఏం చేశాడంటే.... మిలట్రీకి వెళ్ళాడండీ.... అక్కడ పాకిస్థాన్ యుద్ధంలో టపీమని పిట్టల్నికొట్టినట్లుపాకిస్థానోళ్ళవిమానాల్ని కూల్చిపారేశాడంట! వాడి గురిని మెచ్చుకొని గవర్నమెంటువారు అంటే కలెక్టరుగారు సన్మానంచేసి, ఊరేగించి, ఆ పొలం ఇచ్చి ఘనంగా సత్కారంచేసి పారేశారు. ఇంకేం కావాలి!' అన్నాడు.

'ఆ పుట్టుమచ్చ ఉండడానికి, ఆ పొలం రాడానికి ఏం సంబంధం?' అన్నాను నేను

'అమ్మమ్మ! ఎంత మాట! ఎంతమంది మిలిట్రీకి వెళ్ళడంలేదూ? అంతమందీకూడా విమానాల్ని కూల్చేస్తున్నారా చెప్పండి? అర్జునుడిలా వాడికిపుట్టుమచ్చ ఉంది గనక వాడి గురి దేవలోకం వెళ్ళకపోయినా, ఏదో కొంతవరకు ఆకాశంలో విమానాల్ని పడగొట్టగలిగే అదృష్టాన్ని సంపాదించి పెట్టిందన్నమాట! మీరు ఒప్పుకొని తీరాలి. తప్పదు' అన్నాడు కుండ బ్రద్దలుకొట్టినట్లు.

అతడి మాటల్ని అత్యంత శ్రద్ధాసక్తులతో ఆలకిస్తున్న ప్రయాణికులు కూడా అమిత విశ్వాసంతో 'కావచ్చులెండి; కాదనడానికి వీల్లేదు' అని వారి వారి అభిప్రాయాల్ని ప్రకటించారు. ఇక వాడు ఆ విషయంపై నాకు వాదోపవాదం చేయడానికి అవకాశం పోయింది.

'ఇంతకీ నా క్కూడా అటువంటిదేదో వర్తిస్తుందన్నమాట!' వెటకారంగా అన్నాను.

'అమ్మా!ఎవరుచెప్పగలరు? లాటరీలో ఓ లక్ష తగలకూడదూ? పోయిన వస్తువు దొరికితే చాలదూ? అకస్మాత్తుగాఅదృష్టం పట్టడానికి ఎంత టైం కావాలండీ?" అన్నాడు నా కాలి పుట్టుమచ్చను చూస్తూ.

అక్కడున్న తోటి ప్రయాణికులు అదే పనిగా నా పుట్టుమచ్చను చూస్తుంటే

నిజం చెప్పాలంటే అదివరకు లేని గర్వం కల్గింది. ఎంతో ప్రేమగా, స్వాతిశయంగా, ఎకౌంటులో డబ్బున్న వ్యక్తిలాగా నా పుట్టుమచ్చను చూసు

అక్కడనుంచి పుట్టుమచ్చల ఉనికి, అవి ఉండే చోటునుబట్టి ఫలితాల్ని గురించి రకరకాలుగా ముచ్చటించుకోడం జరిగింది. తర్వాత లాటరీ వైపు దృష్టి మళ్ళింది. లాటరీ తగిలిన అదృష్ట వంతుల్ని గురించి కథలు సాగాయి. ఈ గోష్ఠిలో కొందరు ప్రయాణికులు తమకు తెలిసిన సంఘటల్ని చెబుతూ ఆ లోకాభిరామాయణానికి సంపూర్ణత్వం కల్గించారు.

ఆ తర్వాత అతణ్ణి గురించిన వివరాలు రాబట్టాను. నేను ఊరు, పేరు అడిగితే అతడు సమస్తం చెప్పుకొన్నాడు. చిత్రమైన మనిషిలా అన్పించాడు.

అతని పేరు చిరంజీవులు. ఏలూరు దగ్గర పాలపురం అతని స్వస్థలం అట! పూర్వం చాలా భాగ్యవంతులేనట గానీ ఆస్థి అంతా తగదాల వల్ల హారతి కర్పూరంలా హరించుకొని పోయిందట! సామర్లకోటలో చిరంజీవులు పచ్చగా ఉన్న రోజుల్లో ఐదు పచ్చ కాగితాలు అప్పుగా పుచ్చుకొన్నాడట ఓ అసామి. అది వసూలు చేసుకొనే నిమిత్తం వెళ్తున్నాడట!

కబుర్లు, కాలక్షేపాలతో, క్రాసింగులతో, గూడ్స్‌బండ్ల రాకపోకలతో, సిగ్నల్ ఇవ్వని కారణాలతో పదిన్నర అయ్యేటప్పటికి తాడేపల్లిగూడెం చేరింది మా బండి. కాఫీల కోసం, టిఫెన్లకోసం జనం దిగుతున్నారు చిరంజీవులు, నేను బండిదిగి కేంటీన్ దగ్గరకు వెళ్ళి టిఫెన్ తిని, కాఫీలు తాగాం. డబ్బులు మాత్రం నేనే ఇచ్చాను, బ్రతికి చెడ్డవాడు కదా అనే సానుభూతితో. కంపార్టుమెంటులోకి ఎక్కిన కాసేపటికి బండి కదిలింది. చల్లటి గాలి వీస్తున్నది. కొంత త్రాణ వచ్చింది కాబట్టి నా కన్నులు మూత పడుతున్నవి. ఇంకో గంటన్నరకో, రెండు గంటలకో గాని నేను దిగవలసిన స్టేషన్ రాదు. చిరంజీవులు నా కంటే దూరం వెళ్తాడు గనుక అంతగా నిద్రపోతే లేపుతాడు అనే ధైర్యంతో నిద్రకు ఉపక్రమించాను. వెంటనే నిద్రలోకి జారిపోయాను.

ఆ నిద్రలోనుంచి మెలకువ వచ్చి లేచింది కొవ్వూరు స్టేషన్‌లోనే. అటూ, ఇటూ చూసి, నా ఎదురు సీటులో చూడగా చిరంజీవులు లేడు. ప్రక్కన ప్రయాణీకులతో అతణ్ణి గురించి వాకబ్ చేస్తే, అతను నిడదవోలులో ఏదో గుర్తువచ్చినట్లు దిగిపోయాడని చెప్పారు. నాకు పరమ ఆశ్చర్యం కలిగింది. నాకు చెప్పకుండా దిగిపోయాడేమిటి? అనుకున్నాను. నా కేదో అనిపించి చేతి

సంచికోసం వెదికాను; అది ఉన్నది. వంగి నా చెప్పులకోసం చూసుకొన్నాను; అవి లేవు. నెలక్రిందటేకొన్న చెప్పులు! ప్రాణం ఉసూరుమన్నది. మరుక్షణంలో వాటిని ఎవరు సంగ్రహించి ఉంటారో నాకు అర్థమైంది. నా చెప్పులు పోయాయి అన్న భావాన్ని నా తోటి ప్రయాణీకుల దగ్గర వ్యక్తం చేయలేదు 'పాపం చిరంజీవులు' అని మనస్సులో అనుకొన్నాను. నా చెప్పులమీద కన్నువేసిన అతని ప్రవర్తన ఇప్పుడు గుర్తుకు వచ్చింది. ఇప్పుడేమి ప్రయోజనం?

రైలుబండి గోదావరి బ్రిడ్జిపై నెమ్మదిగా నడుస్తున్నది కిటికీలోనుండి తొంగి చూశాను. కోసిన రెల్లు దుబ్బులు! ఏపుగా పెరిగిన జిల్లేళ్ళు, ఇంకా ఏవో పేరు తెలియని పచ్చని మొక్కలు! మెరుస్తున్న ఇసుక దిబ్బలు! ఒకనాడు గట్లను ఒరపిడిచేస్తూ, అఖండంగా ప్రవహించిన గౌతమీనది ఈనాడు కృశీభూతమై దాని సంపూర్ణ సౌందర్యం కాలప్రవాహంలో వన్నె తరగడం చూసి కాలమహిమ అని అనుకొన్నాను. కొందరు దానిలో డబ్బులు విసురుతున్నారు. నేను మాత్రం జీవనది, జీవనదాత్రి అయిన గోదావరికి భక్తి పూర్వకంగా నమస్కరించాను.

గోదావరి స్టేషన్ వచ్చింది. దిగాను. బయటకు వచ్చాను. ఎండ చంద్ర నిప్పులు చెరుగుతున్నది. చెప్పులు లేని కాళ్ళు చుర్రుమంటున్నాయి. ఇక నడిచే ప్రసక్తి లేదు. రిక్షాకోసం చూస్తున్న నాకు, నాకన్నా ముందు దిగిన ప్రయాణీకులకు ఒక్క రిక్షా అంటే ఒక్క రిక్షా కూడా కనిపించలేదు. గుండెలు జారి పోయాయి.

కారణం ఏమిటా అని భోగట్టా చేస్తే రిక్షా వోనర్లకూ, రిక్షా డ్రైవర్లకు రిక్షా బాడుగలమీద ఏర్పడిన విభేదాలవల్ల, రిక్షా డ్రైవర్లు మూకుమ్మడిగా ఆ రోజున రిక్షాలు నడపడంలేదని తెలిసింది. 'ఈ రోజే జరగాలా రిక్షాల సమ్మె' అని మనసులోనే మూలిగాను.

మాడిపోయిన ఆ రోడ్డుమీద నలుగురితో పాటు నడుస్తున్నాను. తారురోడ్లపై చెప్పులులేని కాళ్ళతో నడవడం దుర్భరంగా ఉన్నది. నడుస్తుంటే ప్రాణాలు జివ్వున లాగేస్తున్నట్లనిపిస్తున్నది. పైగా వడగాలి రివ్వున వీస్తున్నది. అక్కడక్కడ నీడల్లో ఆగుతూ, ఆగుతూ నడుస్తున్నాను. వేసవిలో చెప్పులున్న వాళ్ళు మహారాజుల్లా నడుస్తున్నట్లనిపించింది నాకు. చెప్పులు లేని నేను అప్పులున్నవాడిలా బెరుకుబెరుకుగా నడుస్తున్నాను.

ఆ పరిస్థితికి కారకుడైన చిరంజీవులుపై అప్పుడు నాకు పట్టరాని కోపం కలిగింది. అతణ్ణి లోలోపల శపించాను. యమయాతన పడుతూ దేవీచౌకు దాటి, కంబాలచెరువువరకు వచ్చాను. అక్కడ

నుండి నేను ఇంకా నడవవలసింది మైలు దూరం ఉన్నది. అప్పటికే నా పని అయిపోయింది. కాళ్ళు బొబ్బలు ఎక్కాయి. కళ్ళు మండుతున్నాయి. బట్టలు చెమటతో తడిసిపోయాయి అక్కడ కొంచెంసేపు ఆగుదామని నిశ్చయించుకొన్నాను. అక్కడే వున్న పంపుదగ్గరకెళ్ళి ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కొని దాహం తీర్చుకొన్నాను ఆ పంపుకు దగ్గర్లో వున్న గంగరావిచెట్టు నీడకువెళ్ళి ప్రాణంవచ్చినట్లు అనుభూతి పొందాను.

ఆ చెట్టుక్రింద కూర్చొని చెప్పులు కుట్టుకొంటున్న చొక్కాలేని పాతికేళ్ళ యువకుడు నా రాకను గమనించీ, గమనించనట్లుగా తన పనిలో నిమగ్నమైపోయాడు నేను 'అబ్బా' అనుకొంటూ చేతిలోని సంచిని చెట్టుమొదలుకు ఆనించి, ఎడమచేత్తో చెట్టుని పట్టుకొని రెండుకాళ్ళను మార్చి మార్చి చూసుకొన్నాను. రెండు కాళ్ళు బొబ్బలెక్కి కందిపోయి ఉన్నాయ్.

'ఏటండీ.. అయ్యగోరు... సూసుకొంటున్నారు?' అన్నాడు ఆ యువకుడు తలెత్తి.

'ఏంలేదు....ఏంలేదు....కాళ్ళు' అని ఏంచెప్పాలో తోచక ఆగిపోయి సరిగా నుంచున్నాను.

'మీ కాళ్ళకేం' అంటూ నా కాళ్ళ వైపు చూశాడు. కుడికాలుమీద పుట్టుమచ్చపైన అతని దృష్టి పడింది.

'ఇలే పుట్టుమచ్చుందిగదండి కాలిమీద ....నల్లంగా నా జోళ్ళకేసే రంగులా' అంటూ కత్తిని సానరాయిమీద నూరుతున్నాడు పైపెదవితో క్రింద పెదవిని నొక్కుతూ

'ఈ పుట్టుమచ్చే .. నా మచ్చ మాపిందిరా బాబు.... అబ్బా!! అని బాధగా కళ్ళు మూసుకొన్నాను. కండువాతో ముఖం తుడుచుకొని కళ్ళు విప్పాను.

'ఏటయిందండీ....' అని ముఖంతిప్పి భుజంమీదుగా నా ముఖాన్ని చూశాడు. తర్వాత పుట్టుమచ్చను చూశాడు ఆ తర్వాత ఒక్క క్షణం ఆగి మళ్ళా నా ముఖం చూశాడు. ఒక నిముషంపాటు పని ఆపుచేసి దీర్ఘంగా యోచించాడు. ఆ యువకుడి తరహా చూస్తే నాకు మళ్ళా చిరంజీవులు ధోరణి గుర్తుకు వచ్చింది. నా కష్ట పరంపరలకు చిరంజీవులు పల్లవిలాంటివాడు అయ్యాడు. ఇక వీడేమౌతాడో!? అనుకొన్నాను.

'అయ్యగోరూ....' అన్నాడు యువకుడు అతి మర్యాదగా.

"ఆఁ .. ఏమిటీ...."అన్నాను అతని గొంతులోని అనుకోని మార్దవానికి ఆశ్చర్యపడి.

"ఏటంటే... తమరు యెప్పుడైనా యిద్యానగర్ కాలనీకాడ ...ఆ మర్రిసెట్టు కాడ.... ఎదురుంగా వున్న యింటోగాని వున్నారండి" అన్నాడు గుర్తుకు తెచ్చుకొని చెబుతున్నట్లుగా.



'విద్యానగర్ కాలనీలో మర్రిచెట్టు ఎదురింట్లోనా? అఁ.... అవును.... ఉన్నాను అది పన్నెండేండ్ల క్రిందటి మాట! అయితే నీకెలా తెలుసు?' ఎంతో ఆశ్చర్యంగా అన్నాను. అనాటి నా ఉనికి తెలిసిన మనిషి తటస్థపడ్డాడే అనే సంతోషంతో.

ఎందుకో ఆ యువకుడు చిటికేసి చిరునవ్వు నవ్వుకొన్నాడు. 'రేయ్ సిమ్మాచెలం.... రొండు సోడాలు ... అర్జంట్రోయ్....' అని పెద్దగా ఎదురుగా ఉన్న బడ్డీకొట్టును ఉద్దేశించి కేకవేశాడు. తర్వాత తన కేన్వాసు సంచిలో ఉన్న పట్టైకలు విగించని కొత్త జోడు బయట తీసి బ్రష్ చేశాడు.

....రెండు సోడాలంటున్నాడు. ఒక్కడే రెండూ తాగుతాడేమోలే అనుకొని దుమ్మురేగుతున్న రోడ్డువైపు భయంగా చూస్తున్నాను. అంతలో 'సోడా— తీస్కోండి సార్' అని పన్నెండేళ్ళ కుర్రోడు అన్నాడు.

'నాకెందుకూ? నేనడిగానా ఏమన్నానా?' అని అటుండగా—

'తీసుకోండయ్యగోరు— సోడాదేముంది? తాగండి— తర్వాత.... సూద్దాం' అన్నాడు చెప్పుల్ని ఇంకా బ్రష్‌చేస్తూ.

యాంత్రికంగా తీసుకొని, తాగాను. మొత్తానికి నాకు అయోమయంగా ఉంది. నా పాత అడ్రసుఅడిగి తెలుసుకొని, ఈ మర్యాద చేయడంలోగల అంతర్యం వార్థంకాలేదు. సంచి తీసుకొని నాదారిని నేను పోదామనుకునేసరికి ఆ యువకుడే అన్నాడు.

'అయ్యగోరు.... మీకు సెప్పులు లేనట్టుగున్నాయ్ ... మీ సైజు జోళ్ళు నాదగ్గిరున్నాయ్.... ముందేసుకొని సూడండి .... ' పైపెచ్చు నవ్వుతూ అంటున్నాడు.

'ఆహా.... ఇది బిజినెస్ ట్రిక్కన్న మాట! పది పైసలు సోడా ఇప్పించి, పది రూపాయల చెప్పులు కొనిపించడం గాలంవేసి చేపనులాగడంకాక మరేమిటి? దేశం బాగా మారిపోయింది; అప్పటికీ, ఇప్పటికి' అని మనసులో అనుకొన్నాను

'నా కిప్పుడెందుకోయ్. ఇప్పుడు నా దగ్గర ఎక్కువ డబ్బుల్లేవు కూడాను. జోడు కొనాలని అనుకోడంలేదు' అన్నాను నెమ్మదిగా నచ్చచెబుతున్నట్లుగా

'అయ్యగారూ .... ముందలమేసుకొని సూడండి.... డబ్బులు గొడవ.... తర్వాత' అంటున్నాడు అదే నవ్వుతో.

'ఓరి.... పిడుగా... !' అనుకొన్నాను మనసులో. ఎందుకు నవ్వుతున్నాడో అర్థంకాదు. తేలికగా వాడి మాయలో పడ్డానా? ఏమైనా నేను మాట్లాడలేదు.

'ఊఁ.... యేసుకోండి—ఆలోచిత్తానా రేటి? మీ దగ్గిర డబ్బులు నాకు ముట్టకపోయినప్పుడుగదా!' అని అంటున్నాడు.

'తప్పదురా భగవంతుడా!' అనుకొంటూ నా ముందుంచిన జోళ్ళు తొడుక్కున్నాను అయిష్టంగానే. అయితే ఎంత చిత్రం! ఆ జోళ్ళు ఖచ్చితంగా సరిపోయాయి! కాని కొలతలు లేకుండా ఎలా కుటగలిగాడు సరిగ్గా నాకు సరిపోయే చెప్పుల్ని!?' అని మనస్సులో ఆశ్చర్య పడ్డాను.

'అయితే ఎంతిమ్మంటావ్' జేబులో చెయ్యిపెట్టి అడిగాను.

'పైసా కూడా ఇవ్వనక్కర్లేదయ్య గోరు' అన్నాడు అదే నవ్వుతో.

'అఁ! ఎందుకని?' సంభ్రమంగా అడిగాను.

'అదంతే నయ్యగోరు! అంతే!' తలగోక్కుంటూ అన్నాడు సిగ్గుగా.

'ఎందుకని? అని అడుగుతున్నాను. నువ్వు నాకేమైనా ఋణమైతే... ఏమో గానీ.... పైసా కూడా అక్కర్లేదంటా వేమిటి?' అతనివైపు పరిశీలనగా చూస్తూ అడిగాను.

'అవునయ్యగోరు ... మీరన్నట్టు.... నిజంగా.... ఋణమే! మా అయ్య.... ఆడు జేసిన పనికి కిట్టా ఋణం తీర్చు కొంటున్నాను.' అన్నాడు కన్నులు మెరుస్తుండగా.

'మీ అయ్య ఎవరో? నువ్వెవరో? మీ అయ్య చేసిన పనేమిటో? దానికి నువ్వు ఋణం తీర్చుకోడం ఏమిటో? ఇదంతా నాకు గందరగోళంగా ఉంది. అసలా సంగతి వివరంగా చెప్పరా బాబు!' అన్నాను ఒకవిధమైన కుతూహలంతో.

ఆ యువకుడు చెప్పడం ప్రారంభించాడు :

అయ్యగోరూ! ఇది పన్నెండేళ్ళ కితం సంగతి. నాకూ బాగా గ్యేపకం ఉందది. ఓనాడు, మా అయ్య, నేను యిద్యానగర్ కాలనీలో తిరిగి నాక మీ యింటికాడ కొచ్చాం. మీరప్పుడే ఆఫీసు నుంచి కామాల వొస్తూ. మమ్మల్నిసూసి 'ఎందుకొచ్చర్రా' అన్నారు. అప్పుడు మా వోడు 'సెప్పులు బాగుసేస్తాం; పాలిసు సేస్తాం' అన్నాడు 'అయితే ఈ బూట్లు బాగా పాలీష్ చేసి ఇవ్వండ్రా....' అని మా ఎదురంగా బూట్లు యిప్పి, పావలా గూడా యిచ్చేశారు. అప్పుడే ఈ నల్లని పుట్టు మచ్చని నేను సిత్రంగా సూశాను.

మీరింటోకి ఎల్లంగానే మా అయ్య యేం జేశాడంటే అక్కణ్ణుంచి ఒకటే లగూ తీశాడు. నాకేమీ తెలవక ఆడెనకాల నేనూ లగెత్తాను. శానా దూరం వోయాక బూట్లు గబగబా పాలీసుచేసి, సూరయ్య సారాకొట్టుకి ఎల్లేడు. అప్పుడన్నాడు నాతో 'వురే! యెంకటేసులగా! ఈ సంగతి ఎవురికైనా జెప్పినావంటే పని కత్తితో గొంతు కోస్తా. అటు గూడా యెల్లకు' అన్నాడు. నేను బయ్యంతో తల ఊపాను. అప్పుడు ఆడు యేం జేశాడంటే— 'సూరయ్యోయి బూట్లు కావాలంటివిగా. ఇయిగో మంచియ్యి దెచ్చినా. అయిదు రూపాయి లియ్యి' అన్నాడు. అప్పుడు సూరయ్య 'అయిదూ లేదు గియిదూలేదు. మూడు గ్లాసులు సారా తాగి వోరా దొంగనాయాల! అయ్యేడ గొట్టుకొచ్చావో'ని అన్నాడు. 'సర్లే! కానియ్యి' అని మా వోడు పూటుగా తాగి ఆడే పడివోయ్యాడు. ఆడెప్పుడూ అంతే! కానీ ఆయాల మా యయ్య జేసిన పని నాకు మంచిది కాదని పిచ్చింది. ఆ అయ్యగార్ని దగాజేసి, పాలిసు డబ్బుచ్చుకొని పాడు పనిజేసి నాడని సాలా బాధపడివోయాను.

'వో నెల తరవాత అనుకుంటా మా అయ్య తాగి, తాగి కక్కుకొని, కక్కుకొని సచ్చివొయ్యాడు. అదివరకు 'తాగొద్దురా! అసలే పాణంలేదు నీకు' అంటే బండ బూతులు తిట్టేవోడు. సరే. అన్నీ అయ్యాక మీ యింటికాడకొచ్చాను ఆ సంగతి మీకు సెబ్దామని. మీరు యాడకో బదిలీ అయ్యారని ఆ ఇంటో వోళ్ళు అన్నారు. 'ఎప్పటికైనా కనబడక వోతారా? మా వోడు జేసిన పనికి ఛమాపణ అడిగి అరి రుణం తీర్చుకోక వోతానా?' అని మనసులో గట్టిగా అనుకొన్నాను. ఇప్పుడు ఈ పుట్టుమచ్చ మూలంగా గురుతు తగిలింది. ఇట్టాంటి పుట్టుమచ్చ ఎవురికి నేను చూడలేదు. ఓ అయ్యగారు ఈ జోడు కుట్టమని అడవాన్సు యిచ్చాడు. అరికి కుట్టిన సెప్పులే నా అదృష్టంసేత మీకు సమంగా సరిపొయ్యాయి. ఎట్టాగో చివరికి మా అయ్య రుణం తీర్చు

కొన్నాను. నాకు సాలా సంతోసంగా ఉందిప్పుడు. ఇదీ అసలు సంగతి' అన్నాడు వెంకటేశ్వర్లు ఎంతో తృప్తిగా.

నేను ఈ కథనాన్ని ఆశ్చర్య చకితుణ్ణయి విన్నాను. పన్నెండు సంవత్సరాలనాటి అల్ప సంఘటన నా స్మృతిపథంలో మెదిలింది. దానిని అనుసరించిన కథ నన్ను ఉద్వేగపర్చింది.

లోకంలో ఈ మరచిపోనితనం సంభవమా అనిపించింది. లేకపోతే కాల ప్రవాహంతోపాటు గుండెలోనుండి కొట్టుకుపోవలసిన చోట నీతి, నిజాయితీ నిశ్చలంగా దర్శనమిస్తుంటే, మరోచోట అవి మచ్చుకు కనబడ్డమేలేదు! లోకంలో మనిషికి మనిషికి ఎంత వైవిధ్యం! సంపన్న కుటుంబంలో పుట్టాననీ, అన్ని సుఖాలు చవి చూశాననీ, మాటలలో మభ్యపెట్టిన చిరంజీవులువంటి వారిలో మానవత్వం తిరోగమనం సాగిస్తున్నది! ఇందుకు భిన్నంగా కడజాతిలో పుట్టినా, కడగండ్లు అనుభవించినా తండ్రి ఏనాడో చేసిన అకార్యానికి నిష్కృతిగా మంచి నీళ్ళిచ్చి మన్నన ఇచ్చి చెప్పు లిచ్చిన వెంకటేశ్వర్లులో మానవత్వం చిగుర్చుతున్నది. ఉత్తమ సంస్కారం జాతినిబట్టి వరించదన్నమాట!

వయస్సులో నాకంటే చిన్నవాడు కాబట్టి కాని చేతులెత్తి నమస్కారం చేయాలనిపించిది నాకు!

'వెంకటేశ్వర్లూ! ఎంతో పెద్దవాడ వయ్యావనీ, మంచివాడవయ్యావని నాకు పరమానందంగా ఉంది బాబూ! చాలా సేపైంది. వస్తాను'అని సంచి చేతిలోనికి తీసుకొన్నాను.

'ఉంటాను అయ్యగారు.... దండాలు' అని చేతులు జోడించాడు నమ్రతగా. కాని పుట్టుమచ్చవైపు చూసి చిరునవ్వు నవ్వుకొన్నాడు. అప్పుడు రైలుబండిలోని పుట్టుమచ్చల ప్రస్తావన మదిలో మెదిలింది!

కొత్తగా, మెత్తగా ఉన్న పాద రక్షలపై ఎండలో నేను హుందాగా నడుస్తున్నాను చిరంజీవులు చెప్పినట్లు ఈ పుట్టుమచ్చ మూలంగా నాకు దొరికిందేమిటి? ప్రశ్నించుకొన్నాను. 'పోయిన వస్తువు దొరికితే చాలదూ?' అన్నాడు, ఆ పాద రక్షల చోరుడు! 'అవును.... నాకు దొరికింది వస్తువేకాదు! అమూల్యమైన మానవత్వం!'